# లోక్‌సత్తా పార్టీ

తేది: 22-01-2007

<u>ప్రచురణార్థం</u>

# సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థుల పట్ల వివక్ష తగదు

సంక్షేమ హాస్టళ్లలో స్నానాల గదులు, మరుగుదొడ్లు, మంచినీటి వసతులు చూసినా, పిల్లలు తింటున్న తిండి చూసినా, పడుకోవడానికి చేసిన ఏర్పాట్లు చూసినా, వైద్యసేవల అందుబాటు చూసినా, రాత్రిపూట చదువుకోవడానికి చేసిన ఏర్పాట్లు చూసినా ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. ఆ పిల్లల పట్ల జాలి కలుగుతుంది. సహాయం చేయాలని తపన కలుగుతుంది. కానీ ప్రభుత్వం దీనికి విరుద్ధంగా ఈ హాస్టళ్ల పట్ల, పిల్లల పట్ల అనాదరణతో, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల తమగోడు చెప్పుకోవడానికి వచ్చిన హాస్టల్ విద్యార్థులపై పాశవికమైన లాఠీచార్జితో ప్రారంభించి, తరువాత సాగిన నిధుల మళ్లింపు, బడ్జెట్ కోతల వాతలు ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, పేదల పిల్లల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వైఖరి పూర్తిగా వివక్షతతో కూడుకుంది. గర్హనీయమైంది. మంచినీరు, విద్యుత్తు సౌకర్యాలలో 6.5 కోట్లు, హాస్టళ్ల నిర్వహణ వ్యయంలో 14 కోట్ల కోత, భోజన నిధులలో 3 కోట్ల దారి మళ్లింపు ఇలా వివిధ విభాగాలలో మొత్తం మీద ఈ మూడు శాఖలకు 100 కోట్ల కోత పెడితే ఈ హాస్టల్ పిల్లల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవల్సిందే. ప్రభుత్వ ఇతర శాఖలకు 10 శాతం మాత్రమే కోత విధించి సాంఘిక సంక్షేమ శాఖలకు అంతకు మించిన శాతం కోత విధించడం కంటే దారుణమైన వివక్ష మరొకటి ఉండదు. గత సంవత్సరం కూడా సాంఘిక సంక్షేమ శాఖ నిధులు ఖర్చుపెట్టకుండా మిగుల్చుకోవడాన్ని 'కాగ్' (CAG) తన నివేదికలో అక్షింతలు వేసింది. అయినా ఈ సంవత్సరం కూడా ప్రభుత్వం ఈ హాస్టళ్ల పట్ల మళ్లీ తిరిగి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుంది.

- తక్షణమే సంక్షేమ హాస్టళ్లలో నిధుల కోతకు స్వస్తి చెప్పాలని, గత సంవత్సరం ఖర్చుకాని నిధులను కూడా విడుదల చేసి ఈ హాస్టళ్ల పరిస్థితి మెరుగుపర్చాలని లోక్‌సత్తా పార్టీ కోరుతోంది.
- ఇటీవల రాష్ట్రంలో వందలాది హాస్టళ్ళను లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు సందర్శించగా కూలిపోతున్న కప్పులు చాలా చోట్ల కనిపించాయి. బాలికల హాస్టళ్ళలో కూడా చాలా చోట్ల మరుగుదొడ్లు లేవు. అన్ని హాస్టళ్లలో మంచినీళ్లు, మరుగుదొడ్లు ఇతర వసతులు మెరుగుపర్చాలి. పిల్లలు పడుకోవడానికి ఎవరికీ కొరత లేకుండా బెడ్డింగ్‌లు, దుప్పట్లు సరఫరా చేయాలి.
- హాస్టళ్లలో భోజన స్థితి మెరుగుపర్చాలి.
- పిల్లలకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు, నిరంతర వైద్య సేవలు అందించేలా ఏర్పాటు చేయాలి.
- మా పరిశీలనలో పిల్లల విద్యాప్రమాణాలు చాలా తక్కువగా వున్నట్లు తెలిసాయి. సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థులు తెలివితేటలలో, చురుకుదనంలో ఎవరికి తీసిపోరు. కాని వారి విద్య పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవటంతో చదువులో పునాదులు బలహీనపడుతున్నాయి. రాత్రిపూట పిల్లల చదువుకు సహాయకులుగా అన్ని హాస్టళ్లలో ట్యూటర్లను ఏర్పాటు చేయాలి. స్థానికంగా విద్యావంతులైన వలంటీరుల సాయంతో విద్యాప్రమాణాలు పెంచాలి.

సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని దళిత, గిరిజన, బలహీన వర్గాలు, పేద పిల్లల సంక్షేమం కోసం తక్షణం పై చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ కోరుతోంది.

**(జయప్రకాష్ నారాయణ్)**

జాతీయ సమన్వయకర్త

ఇ.నం. 5-10-180/ఎ&ఎ1, బాండ్‌లేన్స్, ఆదర్శనగర్, హైదరాబాద్-500 001 ఫోన్: 91-40-23299227
E-mail: info@loksattaparty.com Url: www.loksattaparty.com